నేడు పల్స్ పోలియో

మణికొండ: మన దేశాన్ని పోలియో రహితంగా మార్చాలనే ఉద్దేశంతో ఈ నెల 3న (నేడు) పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గండిపేట మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని బస్తీ దవాఖానాలు, బస్టాండ్లు, కూడళ్లలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు సమీపంలోని కేంద్రాల్లో తమ చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలను వేయించాలని ఆమె సూచించారు.

మెగా వైద్య శిబిరం..

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్ 16 లోని నేతాజీ పార్కులో ఈ నెల 3న (నేడు) మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వీఆర్ ఫోర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఎ.లక్ష్మణ్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల రోగాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగనున్నదని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కోకాపేటలో కరాటే పోటీలు..

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో ఈనెల 3న (నేడు) నాలుగో రాష్ట్ర స్థాయి సక్సెస్ షోటాకాన్ కరాటే చాంపియన్ షిప్–2024 పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ కె. రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోకాపేట కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు సినీ నటుడు సుమన్ హాజరై పోటీలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు, వీక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

స్టాండింగ్ కమిటీ సభ్యురాలుగా అర్చన


అర్చన

రాజేంద్రనగర్: గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలుగా రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ కార్పొరేటర్ అర్చనా జయప్రకాశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించగా పార్టీ బలపర్చగా తాను ఎన్నికైనట్లు ఆమె తెలిపారు.

జలమండలి జీఎం బదిలీ..?

మణికొండ: జలమండలి మణికొండ 18 డివిజన్ జీఎంగా సుదీర్ఘ కాలం పనిచేసిన రవీందర్‌రెడ్డిని బదిలీ చేశారు. ఆయన స్థానంలో గతంలో మణికొండలో డీజీఎంగా పనిచేసి ప్రమోషన్ పొందిన మహేందర్‌నాయక్‌ను నియమించారు. దాంతో నూతన జీఎంగా మహేందర్‌నాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. అయితే మధ్యాహ్నం తర్వాత ప్రస్తుతం చేపట్టిన బదిలీలను ఈ వేసవి ముగిసే వరకు నిలిపివేస్తున్నామని, జూలై నుంచి అవి అమల్లోకి వస్తాయని తాజా ఆదేశాలు వెలువడినట్టు జలమండలి అధికారులు తెలిపారు. దీంతో వచ్చే జూన్ నెలాఖరు వరకు ప్రస్తుత జీఎం రవీందర్‌రెడ్డినే కొనసాగుతారని వారు పేర్కొన్నారు. తాజా ఆదేశాలు ఏమైనా వస్తేనే మార్పులు ఉంటాయని తెలిపారు.

పాదయాత్రగా శ్రీశైలానికి స్వాములు



మైలార్‌దేవ్‌పల్లి: గగన్‌పహాడ్ శివాంజనేయ స్వామి ఆలయంలో 25 మంది స్వాములు శనివారం ప్రత్యేక పూజలు చేసి ఇరుముడులు కొట్టుకొని శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గురుస్వాములు గోవర్ధన్‌రెడ్డి, శివారెడ్డి మాట్లాడుతూ.. యేటా 200 కిలోమీటర్ల పాదయాత్రగా వెళ్తున్నామన్నారు. ఈ నెల 8వ తేదీన శ్రీశైలానికి చేరుకొని మల్లికార్జున స్వామిని దర్శించుకుంటామని తెలిపారు. పాదయాత్రలో అభిరామ్, బీమ్ రెడ్డి, మోను, శివమణి, నాగరాజు, కేశవులు, రవి, సన్నీ, శివసాగర్, రాము, కాశీ, నాగరాజు, హరీశ్ తదితరులు ఉన్నారు.

నేరగాడి గుట్టురట్టు

- హైదరాబాద్ నుంచి పారిపోయి కర్ణాటకలో మకాం
- హిజ్రా మాదిరిగా యాచన
- పట్టుకున్న అధికారులు

బెంగళూరు: హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చి కర్ణాటకలో తలదాచుకున్న నేరగాడి గుట్టు రట్టయ్యింది. పూణె– బెంగళూరు జాతీయ రహదారిలో హిజ్రా వేషంలో భిక్షాటన చేస్తున్న యువకుడిని చిత్రదుర్గ జిల్లా గోణూరు యాచక పునరావాస కేంద్రం అధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా అతడు మామూలు వ్యక్తి కాదని, బడా నేరగాడని బయటపడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. తెలంగాణకు చెందిన పైలార వంశీ (22) ఇటీవల హైవేలో యాచిస్తూ ఉండగా, పునరావాస కేంద్రం అధికారి మహాదేవయ్య గమనించి అతడిని ప్రశ్నించారు. తాను కట్టడ కార్మికుడినని చెప్పాడు. సరేనని పునరావాస కేంద్రానికి తరలించి పోలీసులకు సమాచారమిచ్చారు. లోతుగా విచారించగా తెలంగాణలో అనేక నేరాలకు పాల్పడి తప్పించుకొని తిరుగుతున్నట్లు తేలింది.

రేప్, హత్య కేసులు

హైదరాబాద్ సమీపంలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో అతనిపై హత్య, లైంగికదాడి వంటి అనేక కేసులు ఉన్నాయి. దీంతో వారు తెలంగాణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వంశీ గతంలో 18 నెలల పాటు జైల్లో ఉండి, అతని తాతా బెయిలు ఇప్పించగా, కర్ణాటకకు పారిపోయి వచ్చాడు. మొదట చిక్కబళ్లాపుర జిల్లా బాగేపల్లిలో హిజ్రా వేషంలో భిక్షాటన ప్రారంభించాడు. రోజుకు రూ. 3 వేల నుంచి 4 వేల వరకు సంపాదించి తమ ముఠా లీడర్‌కు ఇచ్చేవాడు. వంశీ నేరగాడని తెలిసి ముఠా లీడర్ బయటకు గెంటేసింది. తరువాత చిత్రదుర్గకు వచ్చి అక్కడ కూడా హిజ్రా వేషంలో యాచన సాగించి పట్టుబడ్డాడు. తెలంగాణ పోలీసులు నిందితుడిని చిత్రదుర్గ కోర్టులో హాజరు పర్చి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

గోల్కొండ: నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం, అనుమతి లేకుండా ఇళ్లు నిర్మించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బల్దియా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ విజయరాణి అన్నారు. శనివారం ఆమె కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్‌హాజరీతో కలిసి మోతీదర్వాజా వద్ద గల అహ్మద్ కాలనీ నాలాను పరిశీలించారు. కొందరు అక్రమార్కులు నాలాను కబ్జా చేసి ఇళ్లు నిర్మిస్తున్నారని, అదే విధంగా కొత్త రోడ్డు వేసేందుకు రోడ్డు వ్యర్థాలను మోతీదర్వాజా వద్ద గల కందకంలో వేసి మూసేస్తున్నారని ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్ హాజరీ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు బల్దియా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బల్దియా కమిషనర్ ఆదేశాల మేరకు ఆమె ఆక్రమించిన నాలాను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ విజయరాణి తెలిపారు.



చెరువులో గుర్రపుడెక్క తొలగింపు

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చెరువులోని గుర్రపు డెక్కను కౌన్సిలర్లు, సిబ్బంది శనివారం తొలగించారు. చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరగడంతో దోమలు విజృంభిస్తున్నాయని ఇటీవల అలకాపూర్ టౌన్‌షిప్ సంక్షేమ సంఘం నాయకులు మున్సిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను కలిసి విన్నవించారు. దాంతో వారు స్పందించి పనులు చేపట్టారు. శనివారం 7,8 వార్డుల కౌన్సిలర్లు పద్మారావు, నవీన్‌కుమార్ పరిశీలించి సిబ్బందితో కలిసి గుర్రపుడెక్కను తొలగించారు. వారం రోజుల్లో పనులు పూర్తవుతాయని వారు పేర్కొన్నారు.

– మణికొండ

నీటి సరఫరాను పెంచండి


అధికారులతో మాట్లాడుతున్న కేపీఆర్ కాలనీ నాయకులు

మణికొండ: వేసవి ప్రారంభంలోనే బోర్లు వట్టిపోయి తీవ్ర నీటి సమస్య నెలకొందని జలమండలి తరపున నీటి సరఫరాను పెంచాలని మణికొండ మున్సిపాలిటీ, కేపీఆర్ కాలనీ వాసులు అధికారులను కోరారు. ఈ మేరకు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో జలమండలి జీఎం మహేందర్‌నాయక్, మేనేజర్ స్ఫూర్తిరెడ్డిని శనివారం కలిసి విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ అవసరమైతే మరికొన్ని వాల్స్ ఏర్పాటు చేస్తామని, నీటి సరఫరా సమయాన్ని పెంచుతామని హామీనిచ్చారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ భాస్కర్, కార్యదర్శి సింహారాజారెడ్డి, కోశాధికారి గిరి, నాయకులు గణేష్‌రెడ్డి, వేణు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్: మూసీనది పరీవాహక ప్రాంతంలో వెలిసిన అక్రమ కట్టడాలను శనివారం అధికారులు, సిబ్బంది కలిసి కూల్చివేశారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు మూసీ ప్రక్షాళనకు సంబంధించిన డిప్యూటీ కలెక్టర్ మాలతి, అదనపు కమిషనర్ ఆఫ్ పోలీసు లక్ష్మీనారాయణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారి, రెవెన్యూ, పోలీసు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు, నదీ పరీవాహక ప్రాంతాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అదే విధంగా భావితరాలకు ఉపయోగపడే ప్రభుత్వ స్థలాల్లో అనుమతుల్లేకుండా నిర్మిణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో ప్రతిభ వెలికి


నమూనాలను తిలకిస్తున్న పి.రాఘవేంద్ర రావు, వీణ జోషి, సయ్యద్ అజ్హర్

అత్తాపూర్: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయవచ్చని ఐసీఏఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.రాఘవేంద్ర రావు, ఆర్టికల్చర్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వీణ జోషి, ఐసీబీఎం శాస్త్రవేత్త డాక్టర్ సయ్యద్ అజ్హర్ అన్నారు. అత్తాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన నమునాలను తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచం గర్వించే స్థాయికి విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. తాము చదువుకున్న రోజుల్లో పెద్దగా టెక్నాలజీ లేకపోవడం.. సంబంధించిన పరికరాలు కూడా అందుబాటులో లేని కారణంగా త్వరగా అవగాహన చేసుకోలేకపోయేవారమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నమునాలను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుధా, అకాడమీ ఇన్‌చార్జి పరమేశ్, డీన్ ప్రియా మనీశ్, డీఐ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సందడిగా 'టీ హబ్' ప్రాంగణం

గచ్చిబౌలి: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో శనివారం సందడి వాతావరణం నెలకొంది. యూజీఎస్ అండర్ గ్రాడ్యుయేట్ సమ్మిటను స్టూడెంట్ ట్రైబ్ సంస్థ నిర్వహించింది. ఈ సమ్మిట్‌లో ఐఏఎస్ అధికారి జీవీఎస్ పవనదత్త, ఐఆర్‌ఎస్ అధికారులు తరుణ్‌రెడ్డి, గాయత్రి, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, సినీ గాయకులు రేవంత్, దామిని, ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల స్టాండప్ కమేడియన్ రాజశేఖర్ మామిడన్న, వంటలక్క కుమారీ ఆంటీ పాల్గొన్నారు. ఆయా రంగాల్లో వారు సాధించిన ప్రగతిని వివరించడంతో పాటు యువతకు ప్రోత్సాహిన్నిచ్చే, స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలు చేశారు. ముఖ్యంగా యువత తాము ఎంపిక చేసుకున్న రంగంలో రాణించేందుకు, పోటీని తట్టుకొని నిలబడుతూ ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ ఏ రంగంలో రాణించినా ఆయా రంగాల్లో ప్రోత్సహించే సంస్కృతి అవసరమన్నారు. ఉన్నత విద్యనభ్యసించే వాళ్లు వ్యాపార రంగంలో అడుగులు వేయానుకునే అండర్ గ్రాడ్యుయేట్ల కోసం అనేక మంది నిపుణులతో ఇంటరాక్టివ్ కావాలని సూచించారు. అనంతరం పలు చర్చాగోష్టి కార్యక్రమాలను నిర్వహించారు. స్టూడెంట్ ట్రైబ్ నిర్వాహకులు చరణ లక్కరాజు మాట్లాడుతూ.. మరిన్ని రంగాల్లో ఔత్సాహిక అడుగులు వేస్తున్నారని, వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో రాణించడం సులువన్నారు. యువతకు ప్రత్యేక మార్గదర్శనం చేస్తూ ప్రోత్సహిస్తే మనదేశంలో అనేక అద్భుతాలను సృష్టిస్తారన్నారు. అనంతరం యువ గాయకులు ఆలపించిన గీతాలు, రకరకాల కార్యక్రమాలు యువతను ఆకట్టుకున్నాయి.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో క్లీనప్ డ్రైవ్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. క్యాంపస్‌లోని కేంద్రీయ విద్యాలయ ప్రాంగణంలో వలంటీర్లు, విద్యార్థులు, శానిటేషన్ విభాగం, హార్టికల్చర్ విభాగం అధికారులు, సిబ్బంది ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య పర్యవేక్షణలో డ్రైవ్ నిర్వహించారు. ఎండిన ఆకుల కుప్పలు, పొదలు, చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. అనంతర ట్రాక్టర్ల ద్వారా డంప్‌యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రతి శనివారం క్యాంపస్‌లో డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. వలంటీర్లు, శానిటేషన్, హార్టికల్చర్ విభాగాల సహకారంతో చేపట్టే డ్రైవ్‌లో విద్యార్థులంతా పాల్గొని క్లీన్ అండ్ గ్రీన్‌లో మరింతగా అభివృద్ధి చేయడంలో చేయూత తమవంతూ అందించాలని కోరారు. ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ భీం సింగ్, ఉద్యానవనశాఖ నుంచి సుదాకర్, మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

మేధో సదస్సుకు మంత్రి పొన్నం హాజరు

శంషాబాద్ రూరల్: పట్టణంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన రాజీవ్ సంఘటన్ మేధో సదస్సుకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి, వివిధ జిల్లాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

శంషాబాద్ రూరల్: శంషాబాద్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీనాథ్‌ను శామీర్‌పేటకు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో ఆర్సీపురం రాణా నుంచి కె.నరేందర్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి రానున్నారు. రెండు నెలలకే ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ బదిలీ కావడం చర్చనీయంసంగా మారింది.

కాలువలో పడి యువకుడి మృతి


సతీశ్ (ఫైల్)

రాజేంద్రనగర్: కిస్మత్‌పూర్ ఈసీ కాలువలో ప్రమాదవశాత్తు ఓ యువకుడు పడి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కిస్మత్‌పూర్‌కు చెందిన సతీశ్ (30) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం కిస్మత్‌పూర్ కాలువ వద్దకు తోటి స్నేహితులతో కలిసి వెళ్లాడు. అక్కడే స్నానాలు చేసిన అనంతరం బయటకు వస్తుండగా కాలు జారి కాలువలో పడి మునిగి పోయాడు. దీంతో స్నేహితులు ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలపగా.. వారు కాలువలోకి దిగి గాలించగా మృతదేహం లభ్యమైంది. దీంతో ఈ విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

బ్యాంకును మోసం చేసిన కేసులో మరొకరి అరెస్ట్

రాయదుర్గం: బ్యాకుకు మోసం కేసులో నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. సైబరాబాద్‌లోని ఆర్థిక నేరాల విభాగం సైబరాబాద్ పోలీసులు నిందితుడు మహ్మద్ ఫైజ్ ఆహ్మద్‌ను అరెస్ట్ చేశారు. ఈఓడబ్ల్యూ పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు నకిలీ పత్రాలను సమర్పించి బాలానగర్‌లో కెనరా బ్యాంక్‌లో రూ.1.30 కోట్లను రుణ మొత్తాన్ని స్వీకరించాడు. అనంతరం రుణం చెల్లించడంలో విఫలమైన ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడంతో అతడిని ఈఓడబ్ల్యూ పోలీసులు అరెస్ట్ చేశారు. బాలానగర్ కెనరా బ్యాంక్ జీఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి అతడిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా శనివారం రామాంతపూర్‌లో మహ్మద్ ఫైజ్ ఆహ్మద్‌ను అరెస్టు చేశారు. ఫిబ్రవరి 20న శ్రీనివాసబాబు మాజీ చీఫ్ మేనేజర్ కెనరా బ్యాంక్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మహ్మమ్ చాంద్‌పాషా పరారీలో ఉన్నారు. వీరి ముగ్గురిపై ఆరోపణలు వచ్చాయి. అరెస్ట్ చేసి నిందితుడు ఫైజ్ ఆహ్మద్‌ను కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించారు.

ఇన్‌స్పెక్టర్ల బదిలీ

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓ బి.జేమ్స్‌బాబును ఏహెచ్‌టీయూ సైబరాబాద్‌కు బదిలీ చేశారు. అల్లాపూర్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.ఆంజనేయులును గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. రాయదుర్గం ఎస్‌హెచ్‌ఓ మహేష్‌ను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌ఓ సీహెచ్.వెంకన్నను రాయదుర్గం ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. రాయదుర్గం డీఐ చంద్రశేఖర్‌ను షాద్‌నగర్ ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా, వీఆర్‌లో ఉన్న హరిభూషణ్‌ను రాయదుర్గం డీఐగా, సైబర్‌క్రైమ్‌లో ఉన్న శ్రీనివాస్ గౌడ్‌ను గచ్చిబౌలి డీఐగా బదిలీ చేశారు.

ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీన్ నరేందర్‌రెడ్డి

ఏజీవర్సిటీ: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం విభాగంలో ×మేరా పెహలా ఓట్ దేశ్ కే లియే× కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం దేశంలోని పౌరుందరికీ కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాషా అనే భేదం లేకుండా ఓటు హక్కు అవకాశం కల్పించిందన్నారు. దేశంలో పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల ప్రజలే తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత ఈ విషయంపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం అధికారులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ వెస్టెండ్ కాలనీలోని ఉమామహేశ్వర్ ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతం ఆయన మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితమే ప్రధాని మోదీ చేతుల మీదుగా అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపనను ఎంతో ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. అలాగే ఈ ఆలయంలో హనుమంతుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణికొండ గార్డన్ అధ్యక్షుడిగా శ్రీనివాసాచారి


మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ను కలిసిన మణికొండ గార్డన్ కార్యవర్గం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ గార్డన్ కాలనీ సంక్షేమ సంఘం కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పార్థసారథి, సంయుక్త కార్యదర్శిగా జగదీశ్ చంద్రరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జి.మల్లేశ్, సంతోష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్‌ను శనివారం కలిశారు. కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు


వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

అత్తాపూర్: ఎస్‌ఎస్‌సీ కన్వెన్షన్ హాల్‌లో హైదర్‌గూడలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ వార్షికోత్సవ వేడుకలను చైతన్యోత్సవ–2024 పేరుతో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెహిదీపట్నం జోన్ ఏజీఎం వి.కృష్ణ, భారతీయ చలన చిత్ర పరిశ్రమ దర్శక నిర్మాత వర్మ, అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడు జి.రమేశ్, మెహిదీపట్నం జోన్ ఆర్ఐ హరికృష్ణ, లాల్‌దర్వాజా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణ్, అకాడమిక్ కో–ఆర్డినేటర్స్ రవి, ప్రవీణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తించాయి. అలాగే గతేడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడు జి.రమేశ్ తన మిమిక్రీతో ఆకట్టుకున్నాడు.

అనారోగ్యంతో రిటైర్డ్ ఎస్సై మృతి


గోపాల్ (ఫైల్)

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డీడీనగర్ కాలనీలో నివాసముంటున్న రిటైర్డ్ ఎస్సై గోపాల్ శనివారం మృతి చెందాడు. ఆయన నాలుగేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. అయితే కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన పార్థీవదేహానికి పలువురు నివాళులర్పించారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ శనివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, జూపార్కు తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో రద్దీగా కనిపించాయి. పర్యాటకుల సంఖ్య పెరగడంతో చిరువ్యాపారాలు కూడా జోరుగా కొనసాగాయి.


చార్‌కమాన్–చార్మినార్ రోడ్డులో సందర్శకుల సందడి